క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గచ్చిబౌలి ఏఈ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సైబరాబాద్ కమిషనరేట్, జయభేరి పైన్‌వ్యాలీ, సన్‌షైన్ హాస్పిటల్, టింబర్ లేక్ కాలనీ, మధురానగర్, రాయదుర్గం పీఎస్, దివ్యశ్రీ, షాగౌస్ మెయిన్ రోడ్, ప్రశాంతిహిల్స్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

మనూలో జాతీయ సదస్సు



సయ్యద్ రషీద్ నసీమ్‌కి మెమెంటో అందజేస్తున్న రిజిస్ట్రార్ అహ్మద్

రాయదుర్గం: 'ఖురాన్'పై మనూలో గురువారం కేరళ ఇంటర్నేషనల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ తఫ్సీర్ అల్‌ఖురాన్, ఉర్దూ విశ్వవిద్యాలయం అరబిక్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు ఖురాన్ యొక్క దక్కనీ, పర్షియన్ భాషల గురించి వివరించారు. ఖురాన్ ప్రాధాన్యతను వివరించారు.

'మనూ'ను సందర్శించిన సంగారెడ్డి విద్యార్థులు



రాయదుర్గం: మనూ యూనివర్సిటీని సంగారెడ్డిలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు తమ అధ్యయన పర్యటనలో భాగంగా గురువారం సందర్శించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హుమైరాసయీద్, అధ్యాపకులు రూహితరన్నుమ్ ఆధ్వర్యంలో విద్యార్థులు బాలికల హాస్టల్, సయ్యద్ హమీద్ లైబ్రరీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్, అండ్ జర్నలిజమ్, ఇన్‌స్ట్రక్షనల్ మీడియా సెంటర్, ఉర్దూ విభాగాలను పరిశీలించారు. ఉర్దూ యూనివర్శిటీలో విద్యా అవకాశాల గురించి అడిగి తెలుసుకున్నారు.

11 నుంచి శ్రీరామ జ్ఞానయజ్ఞం



కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

పంజగుట్ట: లోక కల్యాణార్థం అన్నపూర్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మార్చి 11 నుంచి 19వ తేదీ వరకు ఎన్‌టీఆర్ స్టేడియంలో శ్రీరామ మహా హోమం, జ్ఞానయజ్ఞం నిర్వహిస్తున్నట్టు ట్రస్ట్ చైర్మన్ రంగారావు తెలిపారు. కార్యక్రమ పోస్టర్‌ను గురువారం స్వామి స్థిత ప్రజ్ఞానంద సరస్వతి, వీహెచ్‌పీ ప్రతినిధి వెంకటేశ్వర్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ .. తెలంగాణలో ఇంత పెద్దెత్తున శ్రీ రామ కథా జ్ఞానయజ్ఞం జరగడం ఇదే మొదటిసారని, 108 యజ్ఞశాలలు ఏర్పాటు చేసి ఈ మహా యజ్ఞం నిర్వహిస్తామన్నారు. ప్రతీ రోజు ఉదయం 8 నుంచి సాయంత్రం 6 వరకు హోమయజ్ఞం నిర్వహిస్తామని, తర్వాత ప్రముఖులచే ప్రవచనాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో గురు చరణ్ తల్వార్, రామేంద్రనాథ్ భరద్వాజ్, ఎస్.శ్రీధర్ రెడ్డి, హరికృష్ణ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ బస్సు..బైక్ ఢీ

- డ్రైవర్ వణుకుతుండడంతో మద్యం సేవించాడని అనుమానం
- డ్రంకన్‌డ్రైవ్ టెస్ట్ చేసిన పోలీసులు
- షుగర్‌తో ఇబ్బంది పడిన డ్రైవర్

పటాన్‌చెరు టౌన్: ఓ ప్రైవేట్ స్కూల్ బస్ డ్రైవర్ బైక్‌ను ఢీకొట్టాడు. జరిగిన ఘటనతో ఒక్కసారిగా వణికిపోయాడు. దీంతో అతడు మద్యం సేవించి ఉంటాడని పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానికులు, ఎంఈఓ రాథోడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలపరిధిలోని ఇస్నాపూర్ అంతర్గత రహదారిలో ఓ ప్రైవేట్ పాఠశాల బస్సు డ్రైవర్ పర్వతాలు గురువారం ఓ బైక్‌ను ఢీకొట్టాడు. ఆ సమయంలో డ్రైవర్ వణుకుతుంటే మద్యం సేవించి ఉంటాడని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనంతో ఏఎస్ఐ జగదీష్ సంఘటన స్థలానికి వెళ్లి డ్రైవర్‌ను బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షించగా, అతను మద్యం సేవించలేదని తేలింది. అయితే షుగర్ కారణంగా ఇలా జరిగి ఉండవచ్చనే అంచనాకు వచ్చారు. ర్యాష్ డ్రైవింగ్ నేరం కింద అతనికి రూ.1100 జరిమానా విధించారు.

ఇళ్ల ముందు మురుగు

- లక్ష్మీనగర్ కాలనీ రోడ్డు నంబర్- 21 దుస్థితి
- సంవత్సరం నుంచి అవస్థలు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు.. అధికారులు



మియాపూర్ లక్ష్మీనగర్ కాలనీ రోడ్డు నంబర్- 21లో మురుగు ప్రవాహం

మియాపూర్: ప్రధానరోడ్లపై మురుగు తటాకాలను తలపిస్తోంది. మ్యాన్‌హోళ్ల నుంచి రోడ్లపై ప్రవహిస్తుండడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్ల ముందు మురుగునీరు నిలవడంతో దుర్వాసన, దోమల బెడదతో పాటు కనీసం నడవడానికి కూడా వీలు లేకుండా ఉందని స్థానికులు వాపోతున్నారు. సంవత్సరం నుంచి ఇబ్బందులు పడుతున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు పరిశీలనకే పరిమితమవుతున్నారు తప్పా పరిష్కారం చూపడం లేదని మియాపూర్ లక్ష్మీనగర్ కాలనీవాసులు వాపోతున్నారు.

- మియాపూర్ లక్ష్మీనగర్ కాలనీ రోడ్డు నంబర్-21లో మ్యాన్‌హోళ్లు పొంగి మురుగునీరు రోడ్డుపై నిలుస్తోంది. ఈ రోడ్డులో మురుగు నిలిచి ఉండడంతో చిన్నపాటి కుంటను తలపిస్తూ రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. సంవత్సరం నుంచి మురుగు సమస్యతో కాలనీవాసులు అవస్థలు పడుతున్నారు.
- లక్ష్మీనగర్ కాలనీ నుండి న్యూ కాలనీకి వెళ్లాలంటే ఈ రోడ్డు వెంబడి వెళ్లాల్సి ఉంటుంది. ప్రధాన మార్గం కావడం .. కనీసం నడవడానికి కూడా వీలు లేకుండా ఉంది.
- ఫిర్యాదు చేసిన ప్రతిసారి ఎయిర్ ప్రెషర్ మరమ్మతులు చేయడంతో మళ్లీ రెండురోజులకే సమస్య తలెత్తుతోంది. నెలల తరబడి మురుగు రోడ్డుపై చేరుతోందని వాపోతున్నారు.
- ఇళ్ల ముందు మురుగు నిలిచిపోవడంతో దుర్వాసన, దోమల బెడదతో అవస్థలు పడుతున్నామని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోట్ల రూపాయలు నిధులు వెచ్చిస్తున్నామని ప్రజాప్రతినిధులు చెబుతున్నా సమస్యలు అలాగే ఉన్నాయని విమర్శిస్తున్నారు.



తాత్కాలిక మరమ్మతులతో సరిపెడుతున్నారు

అధికారులు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంలేదు. తాత్కాలిక మరమ్మతులతో సరిపెడుతున్నారు. కనీసం రోడ్డుపై కాలు పెట్టే వీలు లేదు. దోమలతో అనారోగ్యం పాలవుతున్నాం. అధికారులు స్పందించాలి.

–మణిరత్నం, స్థానికుడు

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన



గచ్చిబౌలి జడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న రాయదుర్గం సీఐ మహేష్

గచ్చిబౌలి: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, అవసరానికి మించి సెల్‌ఫోన్ వాడవద్దని రాయదుర్గం సీఐ మహేష్ విద్యార్థులకు సూచించారు. గురువారం గచ్చిబౌలి జడ్పీహెచ్‌ఎస్‌లో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్ వాడుతున్నప్పుడు వచ్చే ఓటీపీలను ఎట్టి పరిస్థితుల్లో ఓపెన్ చేయవద్దన్నారు. తెలియని యాప్‌లను వినియోగిస్తే సైబర్ మోసాలకు గురయ్యే అవకాశం ఉందన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు సెల్‌ఫోన్‌లు ఇవ్వొద్దని సూచించారు. సైబర్ నేరాలు ఎలా జరుగుతున్నాయి.. వాటి వలలో చిక్కుంటె ఎలా నష్టపోతారో వివరించారు. డ్రగ్స్‌పై ఎలాంటి సమాచారం ఉన్నా డయల్ 100 కాల్ చేసి సమాచారం ఇవ్వాలని తెలిపారు. అంతే కాకుండా ట్రాఫిక్ నిబంధనలను విద్యార్థి దశ నుంచే తెలుసుకుంటే ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐలు ప్రమోద్ కుమార్, సతీష్, గచ్చిబౌలి జడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయులు ఇన్నారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

లిపిడ్ జీవక్రియలో కాలేయానిదే ప్రధానపాత్ర

హెచ్‌సీయూ పరిశోధక బృందం వెల్లడి

రాయదుర్గం: లిపిడ్ జీవక్రియలో కాలేయం ప్రధాన పాత్ర పోషిస్తుందని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పరిశోధక బృందం వెల్లడించింది. ఈ వ్యాసం అంతర్జాతీయ నేచర్ కమ్యూనికేషన్స్‌లో ప్రచురించారు. హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్‌లోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోకెమిస్ట్రీకి చెందిన ప్రొఫెసర్ నరేష్‌బాబు సేపూరి ఆధ్వర్యంలో బృందం అధ్యయనం చేసింది. ఈ బృందంలో డాక్టర్ నోబుల కుమార్ తలారి, డాక్టర్ ఉషోదయ మట్టం, నీరజ్‌కుమార్, అరుణ్‌కుమార్, డాక్టర్ తనూజా కృష్ణమూర్తి, డాక్టర్ కళ్యాణ్కర్ మహదేవ్ సహకారంతో ఈ అధ్యయనం చేశారు. ముఖ్యంగా ఫ్యాటీ లివర్ డిసీజ్ (ఎఫ్ఎల్‌డి) ముఖ్యంగా నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్(ఎన్ఏఎఫ్ఎల్‌డి) అనేది ప్రపంచ జనాభాలో 25 శాతం మందిని ప్రభావితం చేసే తీవ్రమైన ఆరోగ్య సమస్య అని పరిశోధనలో వెల్లడించారు. ఇది పొత్తికడుపులో కొవ్వు పేరుకుపోవడం, ఇన్సులిన్ నిరోధకత, టైప్-2-డయాబెటిస్ మెల్లిటస్, హైపర్ టెన్షన్, డైస్లిపిడెమియా, కార్డియోవాస్కులర్ సమస్యలతో సహా జీవక్రియ అసాధారణతల ద్వారా వర్గీకరించబడుతుంది.

మైనింగ్ అనుమతులు నిలిపివేయాలంటూ నిరసన

పటాన్‌చెరు టౌన్: కెఎస్ఆర్ మైనింగ్ అనుమతులు నిలిపివేయాలని గురువారం లక్డారం యువకులు, రైతులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...గ్రామంలోని పెద్ద చెరువు పక్కనే కెఎస్ఆర్‌కు ఇచ్చిన మైనింగ్ అనుమతులను నిలిపివేయాలన్నారు. ఈ విషయంపై పటాన్‌చెరు తహసీల్దార్‌కి వినతి పత్రం అందజేశారన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు కావలి వీరేశం, చంద్రశేఖర్, రామచంద్రారెడ్డి, సత్యనారాయణ, రవీందర్ గౌడ్, నరసింహులు గౌడ్, గణేష్, రవి గౌడ్, శీను తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న లక్డారం యువకులు, రైతులు

పారిశుధ్య నిర్వహణపై అవగాహన



మాట్లాడుతున్న కార్పొరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డి

రామచంద్రాపురం (పటాన్ చెరు): బీహెచ్‌ఈఎల్ జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం జీహెచ్ఎంసీ, రాంకీ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు పారిశుధ్య నిర్వహణపై అవగాహన కల్పించారు. అతిథిగా భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ఇంట్లోని చెత్తాచెదారాన్ని ఎక్కడ పడితే అక్కడ వేయకుండా, ఇళ్ల వద్దకు వచ్చే స్వచ్ఛ ఆటోలకు ఇవ్వాలన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, తడి చెత్త, పొడి చెత్త వేరు చేసే విధానంపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వాడటం వల్ల కలిగే నష్టాలను విద్యార్థులకు ఆమె వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాములు పాల్గొన్నారు.

మహనీయుల జీవితాలు స్ఫూర్తిదాయకం



శివాజీ విగ్రహ భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: మహనీయుల జీవితాలు నేటి తరాలకు స్ఫూర్తిదాయకమని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఇస్నాపూర్‌లో నూతనంగా ఏర్పాటు చేయనున్న రెండు శివాజీ విగ్రహాల భూమి పూజకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాల్లో మహాత్మా గాంధీ, అంబేడ్కర్, ఛత్రపతి శివాజీ విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బాలమణి శ్రీశైలం, ఉపసర్పంచ్ శోభ కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటరెడ్డి, ఎంపీటీసీ అంజిరెడ్డి, సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, రాజు పాల్గొన్నారు.

సెంట్రల్ యూనివర్సిటీ పీజీ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ

రామచంద్రాపురం(పటాన్ చెరు): సెంట్రల్ యూనివర్సిటీ పీజీ ప్రవేశ పరీక్షకు అమృత సత్తయ్య కొల్లూరి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో 30 రోజులపాటు ఉచితంగా రెసిడెన్షియల్ కోచింగ్ ఇస్తున్నట్టు ఆ సంస్థ డైరెక్టర్ డాక్టర్ బాలబోయిన సుదర్శన్, కోఆర్డినేటర్ పల్లికొండ మణికంఠలు తెలిపారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. ఎంఏ పొలిటికల్ సైన్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులకు సంబంధించి కోచింగ్ ఉచితంగా ఇస్తామన్నారు. అమృత సత్తయ్య కొల్లూరి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఎంపికైన వారికి 30 రోజులు శిక్షణతో పాటు, స్టడీ మెటీరియల్, వసతి అన్నీ ఉచితంగానే అందిస్తామన్నారు. దరఖాస్తుకు చివరి తేదీ మార్చి3 అని తెలిపారు. మరిన్ని వివరాలకు తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని అమృత సత్తయ్య కొల్లూరు ఎడ్యుకేషన్ సొసైటీ సెంటర్‌ను సంప్రదించ వచ్చు.

పరిసరాల శుభ్రత అవసరం



హైదర్‌నగర్‌లో నీటి నిల్వలను తనిఖీ చేస్తున్న అధికారి సంధ్య

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్‌లో దోమల నివారణలో భాగంగా ఎంటమాలజిస్టు సంధ్య గురువారం ఇంటింటికీ తిరిగి నీటి నిల్వలను తనిఖీ చేశారు. ఇంటి చుట్టు పక్కల నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని ఆమె సూచించారు. ఇంటి లోపల నీటి సంపులు, డ్రమ్ములు, కుండలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తడి, పొడి చెత్త వేరుచేసి కాలనీకి వచ్చే ఆటోవారికి అందజేయాలని కోరారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే రోగాలు దరి చేరవన్నారు. ఎంటమాలజీ సూపర్‌వైజర్ డి.నరసింహులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వంతో భారత్ వెబ్ 3 అసోసియేషన్ ఒప్పందం

సాక్షి, సిటీబ్యూరో: వెబ్ 3 సాంకేతిక కంపెనీలలో అగ్రగామి ప్రీమియర్ సంస్థ భారత్ వెబ్ 3 అసోసియేషన్ (బీడబ్ల్యుఏ) తెలంగాణ ప్రభుత్వ సమాచార, సాంకేతిక ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ శాఖ (ఐటీఈసీడీ)తో ఒప్పందం చేసుకుంది. దీనిలో భాగంగా వెబ్ 3 సాంకేతిక నైపుణ్య ప్రయోజనాలను రాష్ట్ర ప్రభుత్వం అందుకోనుంది. ఈ ఒప్పంద ఖరారు కార్యక్రమం సందర్భంగా తెలంగాణా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం(ఐ అండ్ సీ) శాఖ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ (ఐటీ అండ్ సీ) శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ మాట్లాడుతూ ఈ ఒప్పందం భారతదేశంలో వెబ్ 3 రంగంలో ముఖ్యమైన ఎకో సిస్టమ్‌ను సాధించే తమ ప్రయత్నాలలో ప్రతిష్టాత్మకమైన మైలురాయిగా నిలుస్తుందన్నారు. ఈ భాగస్వామ్యం స్టార్టప్స్‌కు ఊపునిస్తుందని, అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న రంగంలో అసాధారణ అవకాశాలనూ అందించగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఎమర్జింగ్ టెక్నాలజీస్ డైరెక్టర్ రమాదేవి లంకా కాయిన్ డీసీఎక్స్ చీఫ్ పాలసీ ఆఫీసర్, డైరెక్టర్, భారత్ వెబ్ 3 అసోసియేషన్ కిరణ్ వివేకానంద పాల్గొన్నారు.

స్పా ముసుగులో వ్యభిచార దందా

మియాపూర్ : స్పా పేరుతో వ్యభిచార దందా నిర్వహిస్తున్న వ్యక్తులను అరెస్టు చేసిన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ. రాజు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆల్విన్ కాలనీలో ఏవన్ స్పా బ్యూటీపార్లర్ కొనసాగుతోంది. సదరు పార్లర్‌లో వ్యభిచారం జరుగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో మియాపూర్ పోలీసులు గురువారం రాత్రి ఏవన్ స్పా బ్యూటీషన్ సెంటర్‌పై దాడి చేశారు. తనిఖీలు చేయగా వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు ఆధారాలు దొరకడంతో నిర్వాహకుడు అజయ్ కుమార్‌తో పాటు 10 మంది యువతులు, నలుగురు యువకులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. యువతులను రెస్క్యూ హోమ్ తరలించిన పోలీసులు విటులను అరెస్టు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కల్పవృక్ష వాహనంపై శ్రీనివాసుడు



ఫిలింనగర్: జూబ్లీహిల్స్‌లోని టీటీడీ శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం శ్రీనివాసుడు కల్పవృక్ష వాహనంపై మాడవీధుల్లో విహరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఈ వేడుకల్లో పాల్గొని స్వామివారికి పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారు సర్వభూపాల వాహనంపై తిరువీధుల్లో ఊరేగారు.

ఫైర్ సేఫ్టీ.. మాక్ డ్రిల్

భాగ్యనగర్ కాలనీ: వేసవిని దృష్టిలో ఉంచుకొని అగ్ని ప్రమాదాలు సంభవిస్తే ఎలా స్పందించాలనే విషయంపై ఫైర్‌సేఫ్టీ అధికారులు, కూకట్‌పల్లి పోలీసులు గురువారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్ ఇండస్ట్రియల్ ప్రాంతంలో అధిక శాతం పరిశ్రమలు, కంపెనీలు ఉండటంతో తరచూ అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కంపెనీ యజమానులు తప్పని సరిగా ఫైర్‌సేఫ్టీ పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అగ్ని ప్రమాదం చోటు చేసుకుంటే ఏ విధంగా మంటలను అదుపులోకి తీసుకురావాలనే విషయంపై అవగాహన కల్పించారు. అగ్నిమాపక సిబ్బంది, కూకట్‌పల్లి పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి ఇన్‌స్పెక్టర్ నర్సింగరావు, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.



ప్రశాంత్‌నగర్‌లో అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది, కూకట్‌పల్లి పోలీసులు

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికే రోడ్డు విస్తరణ

ఎమ్మెల్యే గాంధీ



ఉషాముళ్లపూడి రోడ్డులో పర్యటిస్తున్న ఎమ్మెల్యే

భాగ్యనగర్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఉషా ముళ్లపూడి కమాన్ నుండి గాజులరామారం వరకు ఎల్లమ్మబండ ప్రధాన రహదారి 100 అడుగుల రోడ్డు విస్తరణపై గురువారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌తో కలిసి ఆ ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎల్లమ్మబండ రోడ్డులో నిత్యం ట్రాఫిక్ సమస్యతో ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారని, దీని కోసం 100 ఫీట్ రోడ్డు విస్తరణ చేయనున్నట్టు తెలిపారు. విస్తరణకు ఉన్న అడ్డంకులను తొలగిస్తూ తీసుకోవాల్సిన చర్యలపై ప్రణాళికను రూపొందించాలని అధికారులను ఆయన ఆదేశించారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను దూరంగా ఏర్పాటు చేయాలన్నారు. ఎల్లమ్మ చెరువు సుందరీకరణలో భాగంగా మురుగునీరు కలవకుండా డ్రైనేజీ పైపు లైన్ ఔట్‌లెట్ సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, కాశీనాద్ యదవ్, పాండుగౌడ్, పోశెట్టి గౌడ్, కిషన్, కైసర్ తదితరులు పాల్గొన్నారు.

5 కిలో మీటర్లు... 156 నిఘా నేత్రాలు



- నిఘా నీడలో కేబీఆర్ పార్కు.. జీహెచ్‌ఎంసీ వాక్ వే
- గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని అడుగడుగునా కెమెరాల ఏర్పాటు
- క్షణాల్లో నేరస్తుల ఆచూకీ గుర్తింపు

బంజారాహిల్స్: అడుగు తీసి అడుగు వేస్తే చాలు.. ఆ జాడలు సీసీ కెమెరాల్లో నిక్షిప్తమయ్యేలా బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు వాక్ వేలో అడుగడుగునా నిఘా నేత్రాలను ఏర్పాటు చేశారు. పార్కు చుట్టూ ఉన్న జీహెచ్‌ఎంసీ వాక్ వేలో ఐదు కిలోమీటర్ల మేర ప్రతి అంగుళం ఫుటేజీలో బందీ అయ్యేలా కెమెరాలను ఏర్పాటు చేశారు.



జీహెచ్‌ఎంసీ వాక్‌వేలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

- రూ. 78 లక్షల వ్యయంతో 156 కెమెరాలు ఏర్పాటు చేశారు.
- గతంలో ఏర్పాటు చేసిన కెమెరాలకు భిన్నంగా ఈసారి ఐదు మెగా పిక్సల్ మోటొరైజ్డ్ విత్ వెరీఫోకల్ లెన్సెస్‌తో ఈ కెమెరాలు ఏర్పాటు చేశారు.
- ఏ చిన్న పొరపాటు జరిగినా వెంటనే గుర్తించేలా ఈ అత్యాధునిక సీసీ కెమెరాలు పని చేస్తాయి.
- గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని పార్కు చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడమే కాకుండా పార్కింగ్ స్థలాల్లో కూడా బిగించారు.
- పార్కింగ్ స్థలాల్లోను, పార్కు చుట్టూ ఏర్పాటు చేసిన కెమెరాల వ్యవస్థను కేబీఆర్ పార్కు లోపల ఉన్న ఆఫీస్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం చేశారు.
- ఏదైనా ఘటన జరిగినప్పుడు వెంటనే కెమెరాలు పరిశీలించేందుకు వీలుగా అన్ని సౌకర్యాల మధ్య ఈ వ్యవస్థ సిద్ధమైంది.
- గతంలో జరిగిన కొన్ని ఘటనల్లో నిందితులను వెంటనే పట్టుకోవడానికి ఆస్కారం లేకుండా పోయింది. కొన్ని చోట్ల కెమెరాలు ఉండటం, మరికొన్ని చోట్ల కెమెరాలకు చెట్లకొమ్మలు అడ్డుగా ఉండటం, ఇంకొన్ని చోట్ల వైర్లు కట్ కావడం తదితర అసౌకర్యాలతో ఈ కెమెరాల వ్యవస్థ అధ్వానంగా ఉండేది.
- నిందితులను పట్టుకోవడానికి రోడ్డు బయట షాపులు, హోటళ్లకు ఏర్పాటు చేసిన వ్యక్తిగత సీసీ కెమెరాలను పరిశీలన చేయాల్సి వచ్చేది.
- ఇక నుంచి పార్కు వాక్‌వేలోనే ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా ఏదైనా ఘటన జరిగినప్పుడు నిందితులను గుర్తించేందుకు వీలుగా అత్యాధునికంగా బిగించారు.
- ఐదు మెగా పిక్సల్ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ఇక్కడ ఇదే ప్రథమం. ఇదిలా ఉండగా కేబీఆర్ పార్కు లోపల కూడా 44 కెమెరాలు పని చేస్తున్నాయి. వీటిని అటవీ శాఖ నిర్వహిస్తోంది. ఇక వాక్‌వేలో ఏర్పాటు చేసిన కెమెరాలు మాత్రం బంజారాహిల్స్ పోలీసుల నిర్వహణలో ఉంటాయి.